క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పారాయణలు



ఏలేశ్వరంలో పారాయణలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు పారాయణలు పఠించారు. స్థానిక మార్కెట్ వీధిలోని రూపులమ్మ అమ్మవారి ఆలయం వద్ద విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శివ స్తోత్రాలు, లలితా సహస్ర పారాయణాలు చేశారు. అనంతరం దుర్గాదేవి భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరిటీ, ఉడతల రమణారావు, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



ఏలేశ్వరం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ కల్యాణ్

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులకు శనివారం దంత పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో కళాశాల, రాజమహేంద్రవరం కల్యాణ్ డెంటల్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో 160 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఆసుపత్రి దంత వైద్యుడు కల్యాణ్ విద్యార్థులకు పరీక్షలు చేసి దంత సంరక్షణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దంతాలను సంరక్షించుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు, ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి సామగ్రి విక్రయాలకు స్థల పరిశీలన



గోకవరం సంత మార్కెట్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోకవరం: దీపావళిని పురస్కరించుకుని మందుగుండు సామగ్రి అమ్మకాలకు అనువైన స్థలాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. స్థానిక సంత మార్కెట్లో స్థలాన్ని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఫైర్ ఎస్సై ఆర్.గోవింద, గోకవరం ఎస్సై యువి శివనాగబాబు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు పరిశీలించారు. మందుగుండు సామగ్రి అమ్మకాలు చేపట్టే ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వరసాల ప్రసాద్, పులపర్తి బుజ్జి, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆటో దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జగ్గంపేట: మండలంలోని వెంగాయ్యమ్మపురంలో మజ్జి దుర్గాప్రసాద్‌కు చెందిన ఆటో శనివారం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... ఆటో డ్రైవర్, యజమాని దుర్గాప్రసాద్ ఉదయం వెంగాయమ్మపురం నుంచి జగ్గంపేట వచ్చేందుకు ఆటోను బస్టాండ్ వద్ద పార్కింగ్ చేశారు. బయలు దేరడానికి ఆటో స్టార్ట్ చేయగా బ్యాటరీ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికుల సహాయంతో ఆటోను పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి తోసి జగ్గంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.1.20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు జగ్గంపేట ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు తెలిపారు.

పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో వాక్‌థాన్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో శనివారం వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. అవినీతి నిర్మూలనకు కృషి చేయాలని కోరుతూ వాకింగ్ చేశారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ డీజీఎం సత్యవర్ధన్, కుమార్, ఉమామహేష్, వీరేంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డేటా సైన్స్‌తో సమస్యల పరిష్కారం

గండేపల్లి: సంక్లిష్ట, వ్యాపార, సామాజిక సమస్యల పరిష్కారానికి డేటా సైన్స్ దోహదపడుతుందని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సొసైటీ ఫర్ డేటా సైన్స్ ప్రొఫెషనల్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథ్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ సతీష్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటపై తెగుళ్ల దాడి

- పంటతో పాటు సమాంతరంగా ఎదుగుతున్న కలుపు
- వర్షాభావ పరిస్థితులతో తలెత్తిన నీటి కొరత
- నిండుకుంటున్న తాండవ జలాశయం
- ఆకాశంవైపు ఆశగా చూస్తున్న అన్నదాత



ఇండుగపల్లిలో వరి పొలానికి మందు పిచికారీ చేస్తున్న రైతు

కోటనందూరు: ప్రతికూల వాతావరణంలో మెట్ట ప్రాంత ప్రధాన పంట వరిపై తెగుళ్లు ముప్పేట దాడి చేస్తున్నాయి. వేసవిని తలపించిలా కాస్తున్న ఎండలతో తెగుళ్లు ఒకదాని తరువాత మరొకటి పంటను ఆశించి అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఖరీఫ్ ఆరంభం నుంచి లోటు వర్షపాతమున్న మెట్టప్రాంతంలో గత నెల రోజులుగా చినుక పడకపోవడంతో వరిపంటతో సమాంతరంగా గడ్డి (కలుపు) ఎదిగింది. దీంతో పాటు సాగునీటి కొరత తలెత్తుతోంది. ఇదే పరిస్థితి మరో వారం పాటు కొనసాగితే తీవ్రంగా నష్టపోతే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క తాండవ జలాశయంలో కూడా నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇప్పటికైనా వర్షాలు కురవకపోతే తాండవ అధికారులు సైతం చేతులెత్తేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

40 వేల ఎకరాల్లో సాగు

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 40 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. తొలకరి ఆలస్యంగా పలకరించడంతో తుని, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు మండలాల్లో ఆలస్యంగా వరినాట్లు పడ్డాయి. ఇప్పటి వరకూ ఓ మోస్తరుగా ఉన్న తెగుళ్ల బెడద ఇప్పుడు ప్రతికూల వాతావరణంలో ఉధృతమైంది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ తక్షణమే వర్షం కురవాల్సిన అవసరం ఉంది. వరుణుడు కరుణించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

జోరుగా మందుల పిచికారీ

ఆలస్యంగా నాట్లు వేయడం, వర్షాభావ పరిస్థితులతో ప్రస్తుతం వరిపంటను నల్లి, హిస్పా, ఉల్లికోడు తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటి నివారణకు రైతులు విస్తృతంగా మందులు పిచికారీ చేస్తున్నారు. వేడి, ఉక్కపోత వాతావరణం కారణంగా పంటతో సమాంతరంగా కలుపు ఎదిగిపోతోంది. నాట్లు వేసిన 24 రోజుల వరకూ రైతులు మందులతో కలుపును నివారించినప్పటికీ ఆ తరువాత కూలీలతోనే కలుపును తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి రైతులకు అదనపు భారంగా మారింది.

విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటనలు

వర్షాభావ, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్‌తో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పురుగు మందుల వినియోగం, పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

తెగుళ్లు ఆశిస్తున్నాయి



వర్షాలు కురవకపోవడం, తగినంత సాగునీరు లేకపోవడంతో వరి పంటను తెగుళ్లు భారీగా ఆశిస్తున్నాయి. మందులు పిచికారి చేసినా ఫలితం ఉండడం లేదు. తక్షణమే వర్షం కురవకపోతే ఈనిక దశలో ఉన్న వరిపంట దెబ్బతింటుంది. రైతులకు తీవ్ర నష్టం కలుగుతంది.

– గొంప నాగేశ్వరరావు, రైతు, బిళ్లనందూరు

మోతాదుకు మించితే ముప్పు



తెగుళ్ల నివారణకు తగిన మోతాదులో మాత్రమే మందులు వినియోగించాలి. నల్లి నివారణకు డైకోఫాల్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. హిస్పా నివారణకు మోనోక్రోటోపాస్, క్వినాల్ పాస్, క్లోరీఫైరిపాస్ మందులను తగిన మోతాదులో పిచికారీ చేసుకోవడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చు. పురుగు మందులు, ఎరువుల యాజమాన్యంలో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– కె.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

అలరించిన కాశీకావిడి వీధి నాటకం



కాశీ కావిడి వీధి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కళాకారులు కాశీకావిడి వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో రామహరి బలిజి భార్యగా రాచపల్లి సత్తిబాబు, రెండో భార్యగా పక్కుర్తి పుష్ప, కుమారులుగా అమరపల్లి బాలు, తుమ్మా శివమాణిక్యం, ఇసరపు మహి, ఇసరపు శివ నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్–డ్రెసింగ్ చేశారు. తొలుత గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మండల సమావేశం

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వసంతకుమార్ శనివారం తెలిపారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా



జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

ప్రత్తిపాడు రూరల్: ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందని ధర్మవరంలో గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి అన్నారు. మండలంలోని ధర్మవరంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ఆర్.పవన్‌కుమార్, విక్రమ్, కిరణ్ చౌదరీ, దీక్షిత 411 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందుల కిట్లను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో 104 వైద్య సేవలు

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో శుక్రవారం 104 వాహనం ద్వారా రోగులకు వైద్య సేవలు అందించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులకు పరీక్షలు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సౌమ్యశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో 104 వాహనం ద్వారా పర్యటించి రోగులకు వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



తుని రోటరీక్లబ్‌లో పెయింటింగ్స్ వేస్తున్న విద్యార్థులు

తుని: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే యువజనోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొని బొమ్మలు వేసారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు క్లబ్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు సీహెచ్ లోవరాజు జడ్జిగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, యూత్ యాక్టివిటీస్ చైర్మన్ డాక్టర్ పి.ప్రసాద్, క్లబ్ ప్రతినిధులు సీహెచ్ మంగరాజు, బ్రహ్మలింగేశ్వరరావు, ఎస్. వీర్రాజు, ఎస్.సాయిబాబా, పి.సుబ్రహ్మణ్యం, సరస్వతి సేవా సమితి ప్రతినిధి శివరామకృష్ణ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తుని: దుర్గాడ – గొల్లప్రోలు రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. తుని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆ వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై తెలుపు, నలుపు రంగు గళ్ల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ఎరుపు రంగు కట్ బనియన్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



మోటారు బైక్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

ఏలేశ్వరం: జాతీయ రహదారిపై మండలపరిధిలోని చిన్నింపేట వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... వైజాగ్ నుంచి బెంగళూరు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రత్తిపాడు నుంచి యర్రవరం వైపు మోటారు బైక్‌పై వెళుతున్న భార్యభర్తలు ఎం.శ్రీనివాస్, నాగదేవిలను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ వాహనంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వైభవంగా పడిపూజ



కోటి బిల్వార్చనకు హాజరైన అయ్యప్ప మాలధారణ భక్తులు. (అంతర చిత్రం) ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా గల స్థలంలో శుక్రవారం రాత్రి కోటి బిల్వార్చన, పడిపూజ వైభవంగా జరిగాయి. తుని, పాయకరావు పేట అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలకు కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, విశాఖపట్నం జిల్లాల నుంచి వేలాది మంది అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కేరళ చండై వాయిద్యకారుల బృందం

అకాల వర్షంతో ఆందోళన

తొండంగి: అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా శనివారం కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో వరిచేలు తడిసిపోయాయి. ఉదయం ఆకాశం మేఘావృతమై సుమారు గంట పాటు కుండపోత వర్షం కురిసింది. వ్యవసాయ బోర్లు పరిధిలో కోసి పనలపై ఉన్న వరి పంట తడిసిపోయింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఒబ్బిడి చేసే సమయంలో అకాల వర్షాలతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మరికొద్ది రోజుల పాటు అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన వరిపనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



గోకవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అదించడం అభినందనీయమని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, తుర్రం సత్యవతి అన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ డాక్టర్ వనజకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. నూతన ఆస్పత్రి భవనం నిర్మాణం పూర్తికావస్తుందని, డిసెంబర్‌లో ప్రారంభిస్తామన్నారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, డాక్టర్లు రవికుమార్, చైతన్య, రామలక్ష్మి, గంగాధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



తేటగుంటలో ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న ఆత్మ చైర్మన్ రాంబాబు రాజు. తదితరులు

తుని రూరల్: మండలంలోని తేటగుంటలో 200 మంది అర్హులకు శనివారం ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. సర్పంచ్ అత్తి నాగరాజు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పేరూరి బద్రినారాయణ, ఉప సర్పంచ్ పోతుల పెదకాపు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజబాబు రాజు, గణేషుల వీరబాబు, ఏజెన్సీ నిర్వహకులు ప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కిర్లంపూడిలో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. మండలంలోని వీరవరంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన శనివారం మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా పండగలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోట సత్యవతి, తోట గాంధీ, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, పెంటకోట నాగబాబు, అల్లు విజయకుమార్, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పాతంశెట్టి కృష్ణమూర్తి, సర్పంచ్ అంబటి బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత కంటి పరీక్షలు



నేత్ర శస్త్ర చికిత్స పరికరం పనితీరును వివరిస్తున్న చైర్మన్, తదితరులు

గండేపల్లి: రాజరాజేశ్వరి, రామకృష్ణన్ లయన్స్ కంటి ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్టు ఆసుపత్రి చైర్మన్ కొత్తపల్లి రవికుమార్ తెలిపారు. నీలాద్రిరావుపేటలో రూ.85 లక్షలతో ఆధునీకరించిన లయన్స్ కంటి ఆసుపత్రిని శనివారం పునఃప్రారంభించారు. రాజరాజేశ్వరి రామకృష్ణన్ ఐ హాస్పటల్ చైర్మన్ కొత్తపల్లి రవికుమార్ సారథ్యంలో ఆధునిక వసతులతో సిద్ధం చేసిన ఆసుపత్రిని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్లు గట్టి మాణిక్యాలరావు, వి.సూర్యనారాయణ ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పటల్ సౌజన్యంతో నిడదవోలుకు చెందిన రాజరాజేశ్వరి రామకృష్ణన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆసుపత్రి నిర్వహణ కొనసాగనుంది. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల వైస్ డిస్టిక్ గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, కాకినాడ జిల్లా లయన్స్ చైర్మన్ కొత్త కొండబాబు, లయన్స్ జిల్లా గవర్నర్లు జి.మాణిక్యాలరావు, వి.సూర్యనారాయణ, బాదం బాలకృష్ణ, బీవీఎన్ రెడ్డి, కోడూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదతో ఇక్కట్లు



ఏలేశ్వరంలో గుంపులుగా తిరుగుతున్న కోతులు

ఏలేశ్వరం: పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. వానరాల వీరవిహారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ ప్రదేశాలతో పాటు ఇళ్లల్లోకి కోతుల చొరబడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోతులు గుంపులుగుంపులుగా జనసావాసాల మధ్య తిరుగుతూ ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ఇటీవల శివాలయం వీధిలోని మహిళపై కోతు దాడి చేశాయి. పూజారిని గాయపరిచాయి. సాయిబాబా మెట్ట వద్ద రహదారులపై గుంపులుగా తిరుగుతూ వాకర్స్, భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దుకాణాలపై దాడులు చేసి వ్యాపారులను నష్ట పరుస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా అరటి, వరి, అపరాల పంటలను నాశనం చేయడంతో రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి



బెండపూడిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం



బిళ్లనందూరులో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఈఆర్వో మూర్తి

కోటనందూరు: అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని ఈఆర్వో, కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జేవీఎస్ఎన్ మూర్తి సూచించారు. మండలంలోని భీమవరపుకోట, బిళ్లనందూరు, ఇండుగపల్లి, టీజే నగరం తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లంతా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో ? లేదో ? చూసుకోవాలన్నారు. ఆదివారం, వచ్చే నెల 1, 2 తేదీల్లో కూడా ఓటు నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కేఏ మల్లవరం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, కొత్తకొట్టాం గ్రామాల్లో శిబిరాలను తహసీల్దార్ కుశరాజు, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ సందర్శించారు.

గ్రామాల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు

తొండంగి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించినట్టు తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని బెండపూడి, గోపాలపట్నం, శృంగవృక్షం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రత్యేక ఓటు నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా 72 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత జాబితా ప్రకారం 72161 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 35479 మంది, స్త్రీలు 25674 మంది ట్రాన్స్‌జెండర్లు 8 మంది ఉన్నారన్నారు. మార్పులు చేర్పులు అనంతరం తుది ఓటర్ల జాబితా రూపొందిస్తామని చెప్పారు. ఆదివారం కూడా అన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు ఉన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దుకోవాలి

ఏలేశ్వరం: ఓటర్ల జాబితాలో తప్పొప్పులను సరిదిద్దుకోవాలని మున్సిపాల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఓటర్లకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ నిమిత్తం పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో సవరణ నిమిత్తం రెండు రోజుల పాటు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లను, అడ్రసులను మార్చుకొనే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్ఓలు పాల్గొన్నారు.